వేడుకలా.. కేసీఆర్ జన్మదినం

మూసీ తీరంలో దోమల నియంత్రణకు చర్యలు

జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): మూసీ నది, పరిసర ప్రాంతాలలో దోమల బెడదను తగ్గించడానికి జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం గడిచిన 12 రోజులుగా వంద మందికి పైగా కార్మికులతో దోమల లార్వాలను నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్లను నిర్వహిస్తున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. అత్తాపూర్ నుంచి చాదర్‌ఘాట్ వంతెన వరకు మూసీ నదిలోని గుర్రపు డెక్కను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. దోమల లార్వాను నియంత్రించడానికి ఎంఎల్ఓ అయిల్, టెమెఫోస్ వంటి లార్విసైడ్‌లను పిచికారీ చేయడానికి సుమారు 25 నాప్‌సాక్ స్ప్రేయర్లు, ఐదు పవర్ స్ప్రేయర్లను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఈ యాంటీ లార్వా ఆపరేషన్లు బస్తీలు, కాలనీలు, చారిత్రక భవనాలు (ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు, సిటీ కాలేజ్, సాలార్జంగ్ మ్యూజియం)తో పాటు మూసీ బెల్ట్ చుట్టూ ఉన్న గోషామహల్, కార్వాన్ సర్కిల్‌లలోని 5 నుంచి ఆరు డివిజన్లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 15: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్చిలో జరిగే అసెంబ్లీ సమావేశాలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను పోరాటాలతో అడ్డుకోవాలని మాలలకు వారు పిలుపునిచ్చారు. హిమాయత్ నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ అమలు జరిగితే మాల కులస్తులకు భవిష్యత్తు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఉమ్మడి రిజర్వేషన్ హక్కుల రక్షణ కోసం పోరాటం చేస్తున్నామని, కాంగ్రెస్ లోని మాల మంత్రులు, ఎమ్మెల్యే వివేక్ అనుచరులైన కొంత మంది మాల సంఘాల జేఏసీల పేరుతో చలామణి అవుతూ మాలల ఉద్యమాన్ని, శక్తిని బలహీనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఐక్యతతో ఎస్సీ వర్గీకరణ జరగకుండా అడ్డుకోవాలని తీర్పునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎన్ రావు, బేగరి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేతకు పుట్టిన రోజు పండుగ..: మాధవరం

మియాపూర్, ఫిబ్రవరి 15: తెలంగాణ రాష్ట్ర ప్రదాత, బీఆర్ఎస్ అధినేత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. వాడవాడలా విస్తృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని నిర్వహించనున్న వృక్షార్జన కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే కృష్ణారావు కూకట్‌పల్లిలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. మొక్కలు నాటి వాటిని సంపూర్ణంగా పరిరక్షించి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు శ్యామల రాజు, 123 హైదర్ నగర్ డివిజన్ సుబ్బరాజు, మియాపూర్–గోపరాజు శ్రీనివాస్, రోజా, శేరి లింగంపల్లి –రవి యాదవ్ పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదినాన.. మొక్కల నాటు

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఇంజాపూర్‌లో అచ్చంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహ గౌడ్ మొక్కలు నాటారు. తెలంగాణ ప్రదాత కేసీఆర్ జన్మదినం అంటే రాష్ట్రానికే పండుగ అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, మధు, రాజేశ్, శివ తదితరులు పాల్గొన్నారు. *– సిటీబ్యూరో, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ);*

వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మాజీ మంత్రి

వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

విషయం లేని వ్యక్తి తెలంగాణకు సీఎం.. మనకిదో శాపం

- కేసీఆర్ పుట్టిన రోజు వేడుకగా వాలీబాల్ టోర్నీ ప్రారంభం
- ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: విషయ పరిజ్ఞానం లేని వ్యక్తి రాష్ట్రానికి సీఎం కావడం తెలంగాణ ప్రజలకు శాపమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంతకండ్ల జగీదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ జాతిపిత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ను ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం ప్రారంభించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జిల్లా నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం హామీల అమలు నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూ, ప్రతి ఒక్కరు ప్రశ్నించే దిశగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఓయూ వేదికగా మాట్లాడాల్సిన మేధావులంతా మూగబోయారని దుయ్యబట్టారు. ఓయూ అధ్యాపకుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచి నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టారని విమర్శించారు. కనీస విషయ పరిజ్ఞానం లేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల పాలిట శాపమని అన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల మాజీ చైరన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, చిరుమల్ల రాకేశ్, బీఆర్ఎస్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, నేవూరి ధర్మేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, తొట్ల స్వామి యాదవ్, మంద సురేశ్, పడాల సతీశ్, కడారి స్వామి యాదవ్, టైగర్ రఘురాం, అవినాశ్, చందు, వెంకట్, నవీన్ గౌడ్, జంగయ్య, మిథున్ ప్రసాద్, నాగారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో ఘనంగా కేసీఆర్ క్రికెట్ టోర్నీ..

మణికొండ, ఫిబ్రవరి 15: మణికొండ మున్సిపాలిటీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొమ్ము ఉపేందర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టిన రోజు ఫిబ్రవరి 17ను పురస్కరించుకొని కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. మొయినాబాద్ మండలం పరిధిలోని పెద్ద మంగళారంలోని హాట్ స్పాట్ క్రికెట్ స్టేడియంలో కేసీఆర్ ట్రోఫీ పోటీలలో 14 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర బీఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువకులతో కొద్దిసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. రాష్ట్ర సాధకుడైన కేసీఆర్ పేరు మీద ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఆయన మార్గదర్శనం ఎంతో ప్రాముఖ్యమైందని ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి తెలిపారు. అవాస ప్రైడ్, గరుడా, వీటీ నైట్స్, ఎక్స్‌ట్రీమ్ 11, ఔరేలిలా అవెంజర్స్, వారియర్స్ 11, ఏస్ అట్లాంటిస్, జై భవాని, ఈగెల్స్, జై వీర్ హనుమాన్, జీ 2 స్ట్రైకర్స్ , జై హనుమాన్ 11, ఆల్ఫా 11, ఐరా స్పోర్ట్స్ జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. కేసీఆర్ పుట్టినరోజు ఫైనల్ మ్యాచ్ కొనసాగించి విజేతలకు బహుమతులను ప్రకటిస్తామని నిర్వాహకులు ఉపేంద్ర నాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు నీలకంఠం శివరామకృష్ణ, చావా సందీప్, తెల్ల జస్వంత్, ఒంటెద్దు రాజశేఖర్ రెడ్డి, షేక్ ఆరిఫ్ మహమ్మద్, బండారు ఉదయ్ కిరణ్ మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, గుట్ట మీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, రామసుబ్బారెడ్డి, బుద్దోలు బాబు, షేక్ ఆరిఫ్, దిలీప్, సుమ నళిని, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ శనివారం ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, చిరుమల్ల రాకేశ్, బీఆర్ఎస్ నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, పల్లా ప్రవీణ్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, తొట్ల స్వామి, వీర బాబు, మంద సురేశ్, పడాల సతీశ్, కడారి స్వామి యాదవ్, టైగర్ రఘురాం, జంగం అవినాష్, గదరాజు చందు, వేల్పుకొండ వెంకట్, నవీన్ గౌడ్, జంగయ్య, మిథున్ ప్రసాద్, వెంకట్, నాగేందర్, శ్రీకాంత్, ఉస్మానియా యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

రామినేనికి హరీశ్ రావు పరామర్శ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): మలక్‌పేట్ యశోద ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న టీఎన్జీఓస్ రాష్ట్ర కోశాధికారి, తెలంగాణ ఉద్యమకారుడు రామినేని శ్రీనివాస రావుని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం పరామర్శించారు. శ్రీనివాస రావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న హరీశ్ రావు, వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్సలు అందించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన శ్రీనివాస రావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన హరీశ్ రావు అనంతరం, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

34వ సబ్ జూనియర్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

యాదగిరిగుట్ట: జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 15 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను మండలంలోని సైదాపురం ప్రభుత్వ పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 12మంది బాలురు, 12మంది బాలికలు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, కోశాధికారి గంధమల్ల కుమార్ తెలిపారు. ఈ నెల 20నుంచి 23వరకు వికారాబాద్ జిల్లాలో జరిగే 34వ రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పూలెపాక అశోక్, కనుకుల సిద్ధారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు మాదాసు జోసెఫ్, చిందం విజయ్‌కుమార్, అచ్చిన సురేందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంకొండల్, పీఈటీలు యాట సందీప్, లింగస్వామి, శోభన్‌బాబు పాల్గొన్నారు.

తెలంగాణ ఎకనామిక్, స్టాటిస్టిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : తెలంగాణ ఎకనామిక్, స్టాటిస్టిక్స్ సెల్ ఆర్డినేట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధరణికోట భగత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వడ్డేపల్లి వినోద్‌కుమార్, సెక్రటరీగా జయంత్, ఉపాధ్యక్షుడిగా గుణగంటి వెంకటేశ్, జాయింట్ సెక్రటరీగా కృష్ణ, కోశాధికారిగా సంతోష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీను, పబ్లిసిటీ సెక్రటరీగా శ్రావణి, ఈసీ మెంబర్లుగా శారద, బబిత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జాక్ చైర్మన్ జగన్మోహన్‌ప్రసాద్, కోశాధికారి శ్రీకాంత్, టీజీఓస్ రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఐ

రాజాపేట, ఫిబ్రవరి 15 : కార్పొరేట్ దవాఖాన ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో హైదరాబాద్ సుప్రజ దవఖాన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగవేణి, సుప్రజా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిగ విజయ్‌కుమార్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు జయంతి, డాక్టర్లు, మార్కెటింగ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్

బస్వాపురంలో ఉచిత పశు వైద్య శిబిరం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : మండలంలోని బస్వాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతులు ఎప్పటికప్పుడు పశు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, ప్రత్యూషారెడ్డి, గోపాలమిత్ర సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

బస్వాపురంలో పశు వైద్య శిబిరంలో పాడి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కుక్కల దాడిలో 17 గొర్రెలు మృతి

బీబీనగర్, ఫిబ్రవరి 15 : మండలంలోని రాఘవాపురంలో కుక్కల దాడిలో 17 గొర్రెలు మృతిచెందాయి. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గొర్రెల మందపై ఒక్కసారిగా దాడి చేశాయి. ఆ దాడిలో 17 జీవాలు మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.1.7లక్షలు ఉంటుందని బాధితుడు తెల్జూరి నర్సింహ తెలిపారు.

బొరంపేటలో సబ్‌స్టేషన్ పనులకు పరిశీలన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా బొరంపేటలో నిర్మిస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్, మోనోపోల్స్ నిర్మాణాలను శనివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. నగరంలో భారీగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ అవసరాల దృష్ట్యా అత్యంత ప్రాధాన్యతా క్రమంలో 2025 ఫిబ్రవరి చివరి నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇంధన శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. టీజీ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి, టీజీ ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్‌రెడ్డిలతో కలిసి నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. నర్సాపూర్ నుంచి బొరంపేట్ టీజీ ట్రాన్స్‌కోకు అనుసంధానిత 220 కేవీ ట్రాన్స్‌మిషన్‌తో కలిపి 220/1328/33 కేవీ బొరంపేట స్టేషన్ నిర్మాణ వ్యయం 212.20 కోట్లుగా వారు చెప్పారు. మేడ్చల్, బొరంపేట్, పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఆర్సీ పురం, కూకట్‌పల్లి, బాచుపల్లి, నిజాంపేట్, మయూరినగర్, ప్రగతి నగర్, మియాపూర్, అశోక్‌నగర్‌లకు మెరుగైన సేవలందించే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

తుర్కపల్లి, ఫిబ్రవరి 15 : మండలంలోని రాంపూర్ మోడల్ స్కూల్, కాలేజీ విద్యార్థులు ఎయముల అంజలి, ఆకుల పూజ, దాసారం రాధిక, గుండెబోయిన భార్గవి, గౌరబోయిన ప్రవళిక సబ్ జూనియర్ కబడ్డీ బాలికల జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పల్లె రమేశ్‌రెడ్డి తెలిపారు. జిల్లా జట్టుకు కెప్టెన్‌గా ఎయముల అంజలిని నియమించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

తుర్కపల్లిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు

చౌటుప్పల్, ఫిబ్రవరి 15 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడుతాయని సాహితీవేత్త బడుగు శ్రీరాములు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలకూర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్, బడుగు రామస్వామి, కమలమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శ్రీరాములు బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్, పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి గౌడ్, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న బడుగు శ్రీరాములు

నేటి నుంచి ప్రజాపాలన సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి : ఎంపీడీఓ

వలిగొండ, ఫిబ్రవరి 15 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో నమోదు చేసుకోనివారు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రానికి వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో పాల్గొనని కుటుంబాల వారు 040–21111111 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పేరు నమోదు చేసుకుంటే అధికారులు ఇంటికి వచ్చి సర్వే వివరాలను నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సర్వే ఫామ్ డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి వివరాలను నింపి ప్రజాపాలన సేవా కేంద్రంలో అందజేసి ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సర్వే ఆదివారం నుంచి కొనసాగుతుందని తెలిపారు. మిగిలిపోయిన కుటుంబాల వారు వివరాలను నమోదు చేయించుకొని వంద శాతం సర్వే పూర్తి చేసుకోవడానికి సహకరించాలని కోరారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 15 : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నా పోస్టర్‌ను మండలంలోని టంగుటూరులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- ఆమనగల్ రైతు ధర్నాను విజయవంతం చేయండి
- ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట, ఫిబ్రవరి 15: రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్, ప్రభుత్వానికి బుద్ధి చెప్పవలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ నెల 18న రంగారెడ్డి జిల్లా అమనగల్‌లో నిర్వహించే రైతు ధర్నా కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని జిల్లెలగూడలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలతో సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సరూర్నగర్ డివిజన్, ఆర్కే పురం డివిజన్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, తుక్కుగూడ జల్ పల్లి మున్సిపాలిటీలు, మహేశ్వరం కందుకూరు మండలాలకు సంబంధించిన నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తుక్కుగూడకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్ రెడ్డి, రామిడి రామ్ రెడ్డి, అర్జున్, పవన్, అశోక్, రాజు నాయక్, రవి నాయక్, అనిల్ కుమార్ యాదవ్, యాదగిరి, సిద్దాల లావణ్య బీరప్ప, జంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నేతలతో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి